- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని వంతెనలు
- ఏటా వర్షాకాలంలో రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు
- అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి మండలంలో అసంపూర్తిగా ఉన్న నాయకపుగూడ- దుగ్గపూర్ వంతెన



వాగులు దాటేందుకు.. ఎన్ని అవస్థలో?

గుండి వాగు దాటుతున్న మంత్రి సీతక్క(ఫైల్)

జిల్లాలో వాగులపై వంతెనలు పూర్తి కాకపోవడంతో ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వరదలు వస్తే మండల కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు, పాఠశాలలకు చేరుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్‌లో వాగులు, ఒర్రెలపై చేపట్టిన వంతెనలు ఏళ్ల తరబడి పూర్తి కావడం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో వాగులు, ఒర్రెలు పెద్ద సంఖ్య లోఉన్నాయి. దాదాపు గ్రామాలన్నీ వీటిని అనుకునో లేక వీటి అవతలి వైపు ఉన్నాయి. చిన్న పాటి వర్షాలకే వీటిల్లో నీరు పారుతోంది. వానాకాలంలో భారీ వర్షాలకు వచ్చే వరదలతో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తే వంతెనలు లేక పోవడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. అంతంత మాత్రమే రహదారి సౌకర్యం కలిగిన గ్రామాల ప్రజలు వంతెనలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధుల కొరత పనులు పూర్తిపై శ్రద్ధ పెట్టక పోవడంతో ఏళ్ల పాటు వంతెనల నిర్మాణం పూర్తి కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోజుల తరబడి కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలం ముంచుకోస్తున్న తరుణంలో ఈ ఏడాది కూడ గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పేలా లేవు. అధికారుల, నాయకుల చిన్న చూపుతో నిధులు మంజూ రు కాక వంతెనలు పూర్తికాక పోవడంతో జిల్లాలోని అయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా రు. గతంలో జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్క ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి వాగు దాటి రావాల్సి వచ్చింది. అలాగే వాంకిడి మండలంలోని వెల్గి గ్రామానికి వెళ్లేందుకు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సైతం ఎడ్లబండిపై వాగు దాటి గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. దీన్ని బట్టే ప్రజలు పడుతున్న అవస్థల పరిస్థితికి అద్దం పడుతోంది.



ఆసిఫాబాద్ మండలంలో అసంపూర్తిగా గుండి వంతెన

● ప్రజలకు ప్రత్యక్ష నరకమే..

ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే ప్రజలకు ప్రత్యక్ష నరకమే. ఆదివాసీ గూడల నుంచి ప్రధాన పట్టణాలకు రావాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. జిల్లాలోని 335పైగా ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యమే లేదు. ఉన్న గ్రామాలకు వాగులు, వంకల రూపంలో వర్షాకాలమంతా అష్టదిగ్బంధనమే. ఇటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు ఏజెన్సీ మండలాలతో పాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూరు, చింతల మానేపల్లి, దహెగాం, పెంచికలపేట, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల్లో ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్ద వాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని చిన్న వాగులపై నేటికి వంతెనలు లేక పోవడంతో ప్రజానీకం బయట ప్రపంచానికి చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లాలో కల్వర్టులు మొదలుకుని భారీ వంతెనల వరకు ఏవీ పూర్తి కాక పోవడంతో ఏటా ప్రజానీకానికి వర్షాకాలంలో ఇక్కట్లు తప్పడం లేదు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ప్రధాన వంతెనలు సైతం పూర్తి కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

● పరిస్థితి ఇలా..

- ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండి వంతెన పనులు 15 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. సరిపడా నిధులు విడుదల కాక, అధికారులు త్వరగా పనులు పూర్తి చేయక ఏళ్ల తరబడి ప్రజలు కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దవాగుపై వంతెన పూర్తి కాకపోవడంతో అవతలి వైపు ఉన్న గుండి గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- కెరమెరి మండలంలోని అనార్‌పల్లి-కరంజివాడ, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాగజ్‌నగర్- వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు ప్రారంభించి 15 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తవక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.
- తిర్యాణి మండలంలోని నాయకపుగూడ గ్రామం నుంచి దుగ్గపూర్ గ్రామానికి వెళ్లెందుకు మధ్య లో ఉన్న వంతెన పనులు సైతం పూర్తి చేయక పోవ డంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

15 ఏళ్లుగా పూర్తి చేయలేదు..

- జాబిరే రవీందర్, మాజీ ఎంపీటీసీ, గుండి



గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు 15 ఏళ్లుగా పూర్తి చేయలేదు. దీంతో ఏటా వర్షాకాలంలో గుండి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో జిల్లా కేంద్రానికి రావా లంటే వాంకిడి మండలం ఖమాన మీదుగా రావాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు దృష్టి సారించి పనులను వెంటనే పూర్తి చేయాలి.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

దహెగాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని దిగిడ గ్రామంలోమంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం లోపు నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. గ్రామంలోని తాగునీటి వనరులు బావులు, చేతి పంపులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. లగ్గాం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే బుధవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువవికాసం పథకంకు సంబందించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి సజీవన్, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంపీవో రవి, డీఈ సిద్దిక్, ఏఈ ఆత్మారాం ఉన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని ఎల్లూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్న చోట బోర్లకు మోటార్లు ఏర్పా టటు చేయాలని సూచించారు. గ్రామంలో నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చేతి పంపులకు మరమ్మతులు చేయాలని సూచించారు. పోలీసులు మీ కోసంలో భాగంగా ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో వేసిన బోర్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య తదితరులు ఉన్నారు.

5న కేంద్ర మంత్రి పర్యటన



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

రెబ్బెన, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాకు 5వ తేదీన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రానున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. రెబ్బెన క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సభా స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మంచిర్యాల నుంచి వాంకిడి వరకు రూ.3,500 కోట్లతో నిర్మాణంపూర్తి చేసిన జాతీయ రహదారి ప్రారంభోత్సవానికి వస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమా నికి పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, గోలేం వెంకటేష్, అరుణ్ లోయా, అశోక్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, బాల్కశ్యాం పాల్గొన్నారు.

మే డే పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైఖ్య కాగజ్‌నగర్ ఏరియా కమిటీ అధ్యక్షులు సంతోష్, కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ బడా కార్పోరేట్లకు కట్టబెట్టేందుకు చూస్తోందన్నారు. కార్మికులు కేంద్ర విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విలాస్, లక్ష్మినారాయణ, శైలజానాథ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

దహెగాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగ్గాం, దహెగాం వరి కొనుగోలు కేంద్రాలను ఏఈవో వంశీ మంగళవారం పరిశీలించారు. తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టాలని సూచించారు. ఆయన వెంట సీఈఓ నారాయణ ఉన్నారు.

2 నుంచి గ్రామసభలు

బెజ్జూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో మే 2వ తేదీ నుంచి 7 వరకు రాజీవ్ యువ వికాసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు బెజ్జూరు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బెజ్జూరు మండలంలో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గ్రామసభలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ మరమ్మతు పనుల పరిశీలన

కౌటాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనసాగుతున్న 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను వరంగల్(ఆపరేషన్) జీఎం జాడే ఉత్తం మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట డీఈ వీరేశం, ఏడీఏ రాజేశ్వర్ ఉన్నారు.

భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం సాధ్యమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో మంగళవారం భూ భారతి నూతన చట్టంలో పొందు పరిచిన అంశాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజున భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం-2025ని ప్రా రంభించిందని చెప్పారు. ఈ చట్టంలో అంశాల ద్వారా రైతు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ చట్టంపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా భూ భారతిలో అప్పీల్ వ్యవస్థ కీలకమని తెలిపారు. తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులపై రైతుకు న్యాయం జరగక పోతే ఆర్డీవో, సబ్ కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. అక్కడ న్యాయం జరగక పోతే కలెక్టర్ ద్వారా న్యాయం పొంద వచ్చన్నారు. భూమి కొనుగోలు, పాలు పంపకం, వారసత్వ భూమి మార్పిడిలో సర్వేయర్ రూపొందించిన కమతం నక్షను జత పర్చడం వల్ల భవిష్యత్‌లో భూ వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.జూన్ 2వ తేదీ తరువాత ప్రతి గ్రామానికి గ్రామ పాలన అధికారులు వస్తారని చెప్పారు. పార్టు-బి పెండింగ్‌లోని భూమికి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అన్ని మండలాలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఎంపీడీ వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం

పెంచికలపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చెడ్వాయి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మంగళవారం లబ్ధిదారుల వివరాల నిర్ధారణకు వచ్చిన అధికారులను గ్రామస్థులు నిలదీ శారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎవరో కూడా తమకు తెలియదని, మరి ఎలా లబ్ధిదారులను గుర్తించారని అధికారులను ప్రశ్నించారు. దీంతో చేసేదేమి లేక అధికారులు వెనుతిరిగి వెళ్లి పోయారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రెబ్బెన, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. మేడేను పురస్కరించుకొని ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో శ్రామిక మహిళలకు నిర్వహించిన క్రీడల విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, శంకర్, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న వరంగల్ ఆర్‌డీ మసూద్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పురపాలక శాఖ వరంగల్ రీజినల్ డైరెక్టర్ మసూద్ మంగళవారం పర్యటించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన వార్డు అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పట్టణంలో ఇంటి నంబర్లు కేటాయింపు, ఫిష్‌మార్కెట్ సమస్యపై గతంలో ఆర్‌డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటించి.. అక్షరాలు దిద్దించి..

పెంచికలపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామమైన మురళీగూడలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మంగళవారం పర్యటించి గ్రామస్థులతో అక్షరాలు దిద్దించారు. కాగజ్‌నగర్ మండలం చారిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసే సుందిళ్ల రమేశ్ వేసవి సెలవుల్లో జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో అక్షర చైతన్యం కల్పించడానికి సంకల్పించారు. ఈ మేరకు అందరం చదవాలి.. అందరు ఎదగాలి కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నిరక్ష్యరాసులకు సుందిళ్ల రమేశ్ చదువు ప్రాముఖ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. మురళీగూడలో పిల్లలు, మహిళలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామస్థులతో అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా చదువు ప్రాముఖ్యత, బాల్య వివాహాల నిర్మూళన, బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించడం, యువత వ్యసనాల బారిన పడితే కలిగే అనర్థాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలపై గ్రామస్థలకు వివరించారు. కంజర, డప్పు వాయిద్యాలతో పాటలతో అవగాహన కల్పించారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

లబ్ధిదారుల ఎంపిక

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేస్తాం

బెజ్జూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సలుగుపల్లి గ్రామంలో మంగళవారం గిరిజన మహిళలు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదంటూ ధర్నా చేయడంతో వారితో మాట్లాడారు. గ్రామంలో నిరుపే దలను గుర్తించి ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయని తెలిపారు.

రాజీవ్ యువ వికాస్‌కు 1,013 దరఖాస్తులు

సిర్పూర్(టి), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకం కింద రుణాల కోసం 1,013 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. 6న డోర్‌పల్లి, కర్జవెల్లి, లోనవెల్లి, పారిగాం జీపీల, 7న అచ్చెల్లి, భూపాలపట్నం, చీలపల్లి, చింతకుంట, మేట్‌పల్లి, జీపీల, 8న హుడ్కిలి, ఇటిక్యాల పహాడ్, లక్ష్మీపూర్, నవేగాం, వెంపల్లి, వెంకట్రావుపేట పంచాయతీ పరిధిలోని యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏపీఎం దుర్గయ్య, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల పరిశీలన

వాంకిడి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని చౌపన్‌గూడ, పాటగూడ, పిప్పర్‌గొంది గ్రామ పంచాయతీలలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి సంగీత, అన్నపూర్ణ ఉన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

జైనూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు భరత్ వాగ్‌మారే అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంబే ద్కర్ జయంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల సోదాలు

పది మందిపై కేసు నమోదు


వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వడ్డీ వ్యాపారుల ఇళ్లపై మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ సబ్ డివిజల్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ఏకాలంలో పలువురు వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి వద్ద నుంచి బ్లాక్ చెక్కులు, ల్యాండ్ డాక్యుమెంట్స్, బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులు, రూ.11 లక్షల నగదు సీజ్ చేశారు. ఈ మేరకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అక్రమ వడ్డీ వ్యాపారం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 50 మంది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి చదరంగం జట్టు ఎంపిక పోటీలు

రెబ్బెన, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా స్థాయి చదరంగం జట్టు ఎంపిక పోటీలు మే 4వ తేదీన మంచిర్యాల జిల్లా మందమర్రిలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో నిర్వహించనున్నామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సంపత్ కుమార్, ఉమ్మడి జిల్లా చెస్ కన్వీనర్ ఈగ కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-7, అండర్-9 విభాగాల్లో ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అండర్-14 బాలబాలికలకు చాంపియన్ షిప్ నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 8978146456 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పెరిగిన జొన్న సాగు

● తక్కువ ఖర్చుతో దిగుబడి ● వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై రైతుల దృష్టి

కెరమెరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కలిసి రాని వానాకాలం రైతులకు నష్టాలను మిగిల్చింది. యాసంగి పంటల సాగుకు నీటి సమస్య తలెత్తడంతో రైతులు అధికారుల సూచనల మేరకు ఆరు తడి పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా వానాకాలంలో సాగయ్యే జొన్న పంట ఇప్పుడు యాసంగిలోనూ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నీటి వనరులు అంతగా లేని ప్రాంతాల్లోనూ జొన్న సాగు చేసుకునే అవకాశం ఉండడంతో రైతులు దీనిపై దృష్టి సారిస్తున్నారు. రైతులు ఆరుతడి పంటగా జొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. కొందరు వ్యాధుల దృష్ట్యా, బరువు పెరగకుండా ఉండేందుకు అన్నానికి బదులుగా జొన్న రొట్టెలు తింటుండడంతో డిమాండ్ పెరిగింది. దీంతో పచ్చ, తెల్ల జొన్నలకు మార్కెట్‌లో ధర సైతం బాగానే ఉందని చెబుతున్నారు. హైబ్రిడ్ విత్తనాలు ఏ సీజన్‌లో సాగు చేసినా దిగుబడి బాగానే ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు.

మూడు ఎకరాల్లో జొన్న సాగు..

బాపు పటేల్, గోయగాం



మూడు ఎకరాలలో జొన్న పంట సాగు చేస్తున్నాను. మరో ఎకరంలో మొక్కజొన్న వేశాం. వానాకాలం సీజన్‌లో వేసిన పత్తి, కంది పంటలు పూర్తవగానే యాసంగిలో జొన్న, మొక్క జొన్న వేస్తున్నాం. ఇటీవల కాలంలో పశుగ్రాసం దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. జొన్న సాగు చేస్తే పశువులకు సైతం గ్రాసం కొరత తీరనుంది.

వానాకాలం పంట పూర్తయ్యాక..


కెరమెరిలో సాగు చేస్తున్న జొన్న పంట

జిల్లాలోని రైతులు వానాకాలంలో ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారు. పంట పూర్త య్యాక యాసంగిలో జొన్న పంట సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు సూచనల ప్రకారం పంట మార్పిడి సైతం అవుతుందని రైతులు సాగును ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఎక్కువగా ఆసిఫాబాద్ డివిజన్‌లో రైతులు యాసంగిలో జొన్న పంట సాగు చేస్తున్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, జైనూన్, లింగాపూర్, సిర్పూర్(యు), తిర్యాణి మంలాల్లో సుమారు ఆరు వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేస్తున్నారు. కెరమరి మండలంలో సుమారు 29 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో 31 గ్రామ పంచాయతీ పరిధిలో 6,432 మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం యాసంగిలో 624 ఎకరాలలో జొన్న పంట సాగు చేస్తున్నారు. మరో 236 ఎకరాలలో మొక్క జొన్న పంట సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి నేలలు జొన్న పంటలకు అనుకూలం. రైతులు కొన్ని గ్రామాల్లో బోరుబావులు ఏర్పాటు చేసుకుని జొన్న పంటను సాగు చేస్తున్నారు.

మరో రెండు వారాల్లో పంట కోతకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. రైతులు పండించిన జొన్నలకు క్వింటాలకు 4,500 నుంచి 5,500 రూపాయల వరకు ధర ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, జైనూర్ మండలాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం

దత్తుప్రసాద్‌రావు. తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: భూ భారతి చట్టం ద్వారా రైతులకు ఎలాంటి మేలు జరుగుతుంది?

తహసీల్దార్: భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయి. ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భూదార్ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంది?

తహసీల్దార్: భూదార్ వల్ల రైతులకు ఆధార్ కార్డు మాదిరిగా భూదార్ కార్డు రెవెన్యూ అధికారులు అందజేస్తారు. ఇందులో సరిహద్దులు, భూమి మ్యాపింగ్ ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: పలు చోట్ల భూముల సమస్యలు కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త చట్టం ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందా?

తహసీల్దార్: భూ సమస్యల ఏ స్థాయిలో ఉన్నా కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదు. వారసత్వం ద్వారా కుటుంబ సభ్యులకు 30 రోజులలో విచారణ చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి

నీట్ పకడ్బందీగా నిర్వహించాలి

» కలెక్టర్ వెంకటేష్ దోత్రే

» అధికారులతో కలిసి పరీక్ష కేంద్రం పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 4న నిర్వహించే నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ డేవిడ్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖాధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షకు 287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఇందుకు గాను జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రల్ రూం, పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రశ్నా పత్రాలను పూర్తి బందో బస్తుతో భద్రపరుచనున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాల తరలింపు నిబంధన ప్రకారం పడక్బందీగా చేపట్టాలని చెప్పారు. పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షకుడు, పాలనా విభాగం నుంచి ఒక నోడల్ అధికారి, పోలీసు శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించనున్నామని చెప్పారు. పరీక్షా సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించాలని, ఓఆర్ఎస్ అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలలో వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.

సీఎంఆర్ లక్ష్యం త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైస్ మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యం త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి జిల్లా పౌర సరఫరాలు, సంబంధిత శాఖాధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యాలను తర్వగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో సన్నరకం, దొడ్డురకం వడ్లు 56,588 మెట్రిక్ టన్నులు అంచనా రావచ్చని చెప్పారు. రైతుల నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయని మిల్లర్లపై చర్యలు ఉంటాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో, సబ్ కలెక్టర్ తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు చేయాలని తెలిపారు. పక్క రాష్ట్రం నుంచి వడ్లు జిల్లాలోకి రాకుండా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు వెంకట్రావుపేట, గూడెం, సిర్పూర్(టి) ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్‌లు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని మండలంలోని నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం అశోక్‌రోడ్డుకు చెందిన లక్ష్మీనారాయణరెడ్డి (34)అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనారాయణ రెడ్డి ఎన్టీపీసీ జైపూర్‌లో వే బ్రిడ్జీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. లక్ష్మీనారాయణ రెడ్డి తల్లి రెండు సంవత్సరాల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. తల్లి మృతి చెందడంతో మద్యానికి బానిసైన లక్ష్మీనారాయణరెడ్డి విధులకు మద్యం సేవించి హాజరుకావడంతో అధికారులు విధులకు రావద్దని తెలిపారు. దీంతో లక్ష్మీనారాయణరెడ్డి అతిగా మద్యం సేవించి రెండు రోజుల క్రితం మృతి చెందాడు. పక్కన ఉన్నవారు సమాచారం అందించడంతో లక్ష్మీనారాయణ రెడ్డి మృతిపై అనుమానం ఉందని బాబాయి కొడుకు శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి


చుక్కల దుప్పిని పరిశీలిస్తున్న అధికారులు

పెంచికలపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెడ్వాయి సెక్షన్ పరిధిలో అడవి సార్పాల గ్రామ శివారులో వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. ఎఫ్ఎస్‌వో అస్మా తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 7.30 గంటల సమయంలో గ్రామ శివారులో వీధి కుక్కలు చుక్కల దుప్పిపై దాడి చేశాయి. గమనించిన గ్రామస్థులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని వైద్య సేవలు అందించినప్పటికీ మృతి చెందింది. కళేబరాన్ని దహనం చేసినట్లు ఆమె తెలిపారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విలేకరులమని చెప్పుకుంటూ బెల్లంపల్లిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీసీపీ భాస్కర్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ చేసుకొని క్లబ్ నిర్వహిస్తున్నామని కొందరు వ్యక్తులు మరో ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసుకొని విలేకరుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై సానుకూలంగా డీసీపీ స్పందించి నకిలీ విలేకరులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వల్లభాయ్, పులియాల రాజు, వెంకట్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గతంలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న ఐదుగురు వ్యక్తులకు చెందిన ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌తో రికవరీ చేసి మంగళవారం అందించినట్లు సీఐ దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వారు ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి తిరిగి అందజేస్తామని తెలిపారు. ఫోన్లను కనుక్కున్న గన్‌మెన్ జయకృష్ణ, సీసీటీఎన్ఎస్ రైటర్ జీవన్‌రావు, హోంగార్డు ఖదీర్‌ను సీఐ అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


సోలార్ ఇరిగేషన్ వ్యవస్థను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

తిర్యాణి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలోని గుడిపేట గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా మంగళవారం పరిశీలించారు. తిర్యాణి మండలంలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఐసీ-హెచ్ఎఫ్ఎల్ సహకారంతో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో సంగమేశ్వర ఉమ్మడి నీటి వినియోగదారుల సంఘం ఏర్పాటు చేసిన సోలార్ ఇరిగేషన్ వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ ద్వారా 24.30 ఎకరాల భూమిలో 17 మంది రైతులు యాసంగి పంటల సాగు చేస్తున్నారు. అనంతరం వాసన్ ప్రతినిధులు నాటు కోళ్ల పెంపకం, ప్రకృతి వ్యవసాయ విధానాలు, పోషణ వనితల ద్వారా నిర్వహిస్తున్న పోషకాహార అవగాహన కార్యక్రమాలను వివరించారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమాల వల్ల తమ జీవనోపాధిలో వచ్చిన మార్పులను పీవోతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పీవో గ్రామ పెద్దలను, వాసన్ సంస్థ సభ్యులను అభినందించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఐటీడీఏ నుంచి మద్దతు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌వో మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

తీర్మానాలను గెజిట్ చేసి అమలు చేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల సలహా మండలి తీర్మానాలను గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు ఎండీ యూసుఫ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ మాట్లాడారు. గత పదేళ్లుగా వేతనాల పెంపు జరగలేదన్నారు. సోమవారం వేతనాల సలహా మండలి తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని, త్వరగా నిర్ణయం తీసుకుని మే 1వతేదీన ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఫ్రోజ్‌ఖాన్, యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు క్రిష్టోఫర్, కార్యవర్గ సభ్యుడు దొడ్డిపట్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు హక్కులు సాధించిపెట్టాం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘంగా బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహిస్తూ కార్మికులకు అనేక హక్కులు సాధించిపెట్టామని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే కార్మిక సొంతింటికళకు సంబంధించి సింగరేణి సీఎండీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అంగీకారం కుదిరిందన్నారు. కార్మికులకు పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నామన్నారు. మారు పేర్ల మార్పుకు సంబంధించి కూడ త్వరలోనే పరిష్కారమవుతుందని చెప్పారు. 139వ మేడు ఉత్సవాలను మందమర్రి ఏరియాలోని అన్ని గనుల డిపార్ట్‌మెంట్ల వద్ద ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, కంది శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి



శ్రీరాంపూర్‌లో ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం జీఎంకు వినతిపత్రం అందించారు. ఐఎఫ్ టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచడంలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం చెందిందన్నారు. 2013లో కోల్ ఇండియా యాజమాన్యం హై పవర్ కమిటీ వేతనాలను రిలీజ్ చేస్తే సింగరేణిలో ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. నర్సరీ కార్మికులకు సీఎంపీఎఫ్, బోనస్ ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు చూపడం లేదని, జాతీయ పండుగలకు మస్టర్లు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, రాజన్న, అప్పారావు, సదానందం, శ్రీనివాస్ బాబు, శంకర్, సుధాకర్, రమ, విజయ, రాజకళ, శోభ, లక్ష్మీ, సంధ్య పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఆయా విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా తరహాలో కనీస వేతనాలను చెల్లించాలని, ఇతర హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని కాంట్రాక్టు కార్మిక జేఏసీ నాయకులు ఎండీ జాఫర్, మణిరాంసింగ్, మహేశ్వరి, అజయ్, కనకయ్య అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు రూ.35వేలు అమలు చేయాలని కోరుతూ స్థానిక జీఎం ఆఫీసు, సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు రాష్ట్రీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం నుంచి సివిల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎం శ్యాంసుందర్, సివిల్ డిప్యూటీఎస్సీకి సివిల్ అధికారి రాముకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, కనకయ్య, అజయ్, గణేష్, సుల్తాన్, రాజేందర్, వెంకటస్వామి,భూమయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సివిల్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో దాదాపు 35వేల మంది కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తు న్నారని పనికి తగిన వేతనం అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సింగరేణి సూపర్‌వైజర్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో శ్రీనివాస్, కొమురయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఇబ్బందులు పట్టించుకోవాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఇబ్బందులు పట్టించుకోవాలని సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, టీసీకేఎస్, ఏఐఎఫ్‌టీయూ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు, ఈఎస్ఐ, సీఎంపీఎఫ్ అమలు కోసం బుధవారం కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష, ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలకు తగ్గకుండా వేతనాలు ఉండాలన్నారు. కోల్ ఇండియాలో హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేస్తున్నారని, అక్కడ ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.1200 లభిస్తున్నాయని అన్నారు. కానీ సింగరేణి గత పదేళ్లుగా వేతనాల పెంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి తోకల రమేష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథ్, జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, టీసీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలో సీతానగర్ విలేజీ సమీపంలో గొల్లగూడలో అక్రమంగా నిల్వ చేసిన రూ.5 లక్షల విలువ గల టేకు కలపను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎఫ్ఆర్‌వో అనిల్ పాల్గొన్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో చదవడం కోసం వైఫై సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మంగళవారం బూర్గుడ గామానికి చెందిన గాజులప్రసాద్ తన సొంత ఖర్చులతో వైఫై ఇంటర్నెట్ సేవలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి వివిధ ఉద్యోగాల కోసం చదువుతున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆన్‌లైన్‌లో చదవడం కోసం గ్రంథాలయంలో ఇంటర్నెట్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో తన సొంత ఖర్చులతో వైఫై ఇంటర్నెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిని గ్రంథాయానికి వచ్చే నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రెరియన్ సదానందం, యువకులు గజ్జెల వినోద్, సైదం తిరుపతి, అడప అశోక్, లింగమూర్తి, గాజుల సాయి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పీసీఆర్ (పూర్ణచందర్‌రావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తీని తీర్చేదుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశావన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాగుల శంకర్, మున్వర్ ఆలీఖాన్, చందు, లక్ష్మణ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, రవి, గంగన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కొరకు నేటికి 332 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. 121 కేంద్రాల ద్వారా 2,395 రైతుల వద్ద నుంచి 21,143 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 5.73 కోట్లు చెల్లింపు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న ప్యాడీ క్లీనసర్లు, తేమ పరికరాలు, హస్క్ రిమూవర్లు తదితర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల శాసన సభ్యులు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. వేడుకల్లో తూముల నరేశ్, చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, పెంట రజిత, తదితరులు పాల్గొన్నారు.

పరిచయ వేదికను విజయవంతం చేయండి

గర్మిళ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గాండ్ల కులస్తుల వధూవరుల పరిచయ వేదికను మే 4న సికింద్రాబాద్‌లోని కొత్త కామకోటి కళ్యాణ నిలయంలో నిర్వహిస్తున్నామని కులస్థులు హాజరై విజయవంతం చేయాలని అఖిల గాండ్ల తిలకుల సంఘం రాష్ట్ర నాయకుడు ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ విశ్వనాధ ఆలయంలో ఆహ్వాన పత్రికను పూజారికి అందజేసి పూజలు నిర్వహించారు.

- సిద్ధమవుతున్న నూతన భవనం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి నస్పూర్ ఏటీసీ..



నస్పూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నస్పూర్‌లో దాదాపు ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఉపాధి కల్పన శిక్షణా శాఖ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు వర్క్‌షాప్ షెడ్ పైకప్పు షీట్స్ బిగిస్తున్నారు. తరగతి గదులు పూర్తయ్యాయి. రంగులు, విద్యుత్ పనులతో పాటు వర్క్‌షాప్‌లో యంత్రాలను బిగించాల్సి ఉంది. వచ్చే నెల చివరికల్లా నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఐటీఐని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులకు అధునాతన, సాంకేతిక శిక్షణను ఈ కేంద్రంలో వచ్చే విద్యా సంవత్సరం (జూన్-2025) నుంచి తరగతులు ప్రారంభించడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు ఆలస్యం అయితే ఆగస్టు, సెప్టెంబరులో సీట్లను భర్తీ చేయనున్నారు. ప్రస్తుత పారిశ్రామిక రంగానికి అనుగుణంగా ఆరు నూతన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

ఉపాధి కోర్సులపై దృష్టి

● 35 గుంటల భూమి కేటాయింపు..

ప్రస్తుతం శ్రీరాంపూర్‌లో కొనసాగుతున్న ఐటీఐ కోసం నస్పూర్‌లో 35 గుంటల భూమిని కేటాయించారు. శిక్షణ కేంద్రం పక్కనే ఐటీఐ భవన నిర్మాణానికి అధికారులు జీ+2 భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఐటీఐ భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం శ్రీరాంపూర్‌లోని ఐటీఐలో ఎలక్ట్రీషన్స్-20, ఫిట్టర్-20, డీజిల్ మెకానిక్-24, డీఎం సివిల్-24, కంప్యూటర్-48 మొత్తం 150 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నస్పూర్ ఏటీసీ ద్వారా సంవత్సరం, రెండు సంవత్సరాలకు సంబంధించి 172 సీట్లు భర్తీ కానున్నాయి.



నిర్మాణంలో ఉన్న వర్క్‌షెడ్

● కొత్త కోర్సులు ఇవే...

ఇప్పటికే ఐటీఐలో ఉన్న కోర్సులతో పాటుగా నస్పూర్ ఏర్పాటు చేసే ఏటీసీలో మరో ఆరు కొత్త కోర్సులు రానున్నాయి. టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. నూతన కోర్సుల ఏర్పాటుతో ఐటీఐకి పూర్వ వైభవం సంతరించుకోనుంది. ఇందులో ఏడాది కోర్సులు మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేటిక్-40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్-40 సీట్లు, ఆర్టిసియన్ యుూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్-20 సీట్లు అందుబాటులో ఉంటాయి. రెండేళ్ల కోర్సులు బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్-24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్-24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్- 24 సీట్లు అందుబాటులో రానున్నాయి. భవన నిర్మాణం యంత్రాలను అమర్చడంలో ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కోర్సుల్లో సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. కొద్దిగా ఆలస్యం జరిగినప్పటికీ సీట్ల భర్తీని చేయనున్నారు.

పనులు పూర్తయితే అడ్మిషన్లు

టి సుజాత, ప్రిన్సిపల్, ఐటీఐ

భవన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉన్నది. యంత్రాలు కూడా బిగించాల్సి ఉంటుంది. పనులు పూర్తయితే అడ్మిషన్లు తీసుకుంటాము. ముందుగా మే- జూన్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ వస్తాయి. నిర్మాణ పనులు పూర్తయితే ఆగస్టు, సెప్టెంబరులో అడ్మిషన్లకు అవకాశం రావచ్చు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంటుంది.



నస్పూర్‌లోని ఏటీసీ భవనం

సీఎంఆర్ అనుమతులు పొందేదెలా?

(5వ పేజీ తరువాయి)

ధాన్యం ఇవ్వవద్దన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు వాటిని పక్కన బెట్టక తప్పని పరిస్థితులు ఉన్నాయి. మరోవైపు సీఎంఆర్ పెండింగులో ఉన్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకున్న నేపథ్యంలో ధాన్యం ఎక్కడ దించుతారోనన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమైనందున ఇప్పటి వరకు 14 మిల్లులకు జియో ట్యాగింగ్ ఇచ్చారు. జిల్లాలో సేకరించిన ధాన్యాన్ని అవసరమైతే ఇతర జిల్లాలకు తరలించైనా నిల్వ చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. పంట దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున మరిన్ని మిల్లులకు అనుమతులు ఇవ్వడం తప్పనిసరి. సీఎంఆర్ బకాయిపడ్డ మిల్లర్లు నిర్ణీత గడువులోగా 40 శాతం మేర తిరిగి అప్పగించి, మిగతా దానికి బ్యాంక్ గ్యారెంటీ ఇస్తే జియో ట్యాగింగ్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

● బ్యాంకుల చుట్టూ మిల్లర్ల ప్రదక్షిణలు...

ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగొట్టి మళ్లీ అనుమతులు పొందేందుకు మిల్లర్లు నానా తంటాలు పడుతున్నారు. సీఎంఆర్ బకాయిల్లో 40 శాతం తిరిగి అప్పగిస్తుండగా, మిగిలిన దానికి గడువులోగా బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలోని పలు మిల్లులపై క్రిమినల్ కేసులు ఉండగా, అవే మిల్లులకు గ్యారెంటీ ఇచ్చేందుకు బ్యాంకులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంకుల చుట్టూ మిల్లర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాగైనా సీఎంఆర్ అనుమతులు పొందాలనే పట్టుదలతో ఉన్న పలువురు మిల్లర్లు సంబంధిత అధికారులను మచ్చిక చేసుకొనే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలోగల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో యజమానులు ఇటీవల భారీ ఎత్తున దావత్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ట్యాగింగ్ రాని పలువురు మిల్లర్లు నిత్యం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ అనుమతులు తెచ్చుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈక్రమంలో సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించి, డీఫాల్ట్‌లో ఉన్న మిల్లులకు తిరిగి ధాన్యం కేటాయించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

ఆటం చార్జింగ్ స్టేషన్లు ప్రారంభం



ఆటం చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న రాహుల్‌గాంధీ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరెలిలో విశాఖ ఇండస్ట్రీస్ నేతృత్వంలో ఆటం సోలార్ రూఫ్, ఆటం చార్జింగ్ స్టేషన్లు, ఆటం ఈ బైక్‌లను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ భారత్‌ను గ్రీన్ ఎనర్జీమార్గంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆటం ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ-బైక్‌కు సంబంధించి రాహుల్‌గాంధీకి ఎంపీ వంశీకృష్ణ వివరించారు.

అధికారుల తనిఖీలు

తాండూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలోని 11 మంది తెల్లరేషన్ కార్డుదారులు సన్నబియ్యాన్ని వినియోగించకుండా అచ్చలాపూర్ గ్రామంలోని కుంకుమొట్టి మహేష్‌కు రూ. 16 చొప్పున సుమారు రెండు క్వింటాళ్ల సన్నబియ్యాన్ని విక్రయించారు. అందిన సమాచారం మేరకు అధికారులు మహేష్ ఇంట్లో మంగళవారం తనిఖీలు నిర్వహించగా సన్నబియ్యం నిల్వలు దొరికాయి. దీంతో ఈ విషయాన్ని కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారికి తెలపగా సన్నబియ్యం విక్రయించిన కార్డుదారుల రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు బియ్యం కొన్న మహేష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరినట్లు అధికారులు తెలిపారు.

కాలేజీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, నేషనలిస్టు స్టూడెంట్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, నితీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండు ప్రముఖ కార్పొరేట్ కళాశాలలు కుమ్మక్కై ఇటీవల వెలువడిన ఐఐటీ మెయిన్ ఫలితాల్లో ఒకే ర్యాంకు సాధించిన అభ్యర్థి తమ వాడంటే తమ వాడని తప్పుడు ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. వెంటనే కళాశా లలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు కిషన్, బొజ్జు, శ్యాం, రాథోడ్ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 7వ వార్డులో ప్రజలకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేసారు. వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థ లు పడుతున్నామన్నారు. తక్షణమే డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్ల పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు బత్తుల వెంకటేష్, అల్లంపల్లి రమేష్, గుండ ప్రవీణ్, చెల్ల శ్రీనివాస్, బియ్యాల శంకర్, తోట లక్ష్మన్, ఆకేష్, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పదవీ విరమణ ఉద్యోగులు

గర్మిళ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ-2 గనిలో 1979 నుంచి 2006 వరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు మంగళవారం మంచిర్యాలలోని రామసుధ రెసిడెన్సీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. డ్యాన్సులు చేస్తూ ఆనం దంగా గడిపారు. కార్యక్రమంలో 60మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడే కరపత్రాలు విడుదల

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే కరపత్రాలను మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, సంగన్న, రాజన్న, చరణ్, మధు, లక్ష్మీ, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు మేడే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి చింతపురి బాపురావు మాట్లాడుతూ మే 1న జరిగే మేడే వేడుకల్లో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లస్మయ్య, జయారం, హన్మంతు, నారాయణ పాల్గొన్నారు.

మంచిర్యాల: మే డే వేడుకలను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. జన్నారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడేను ఘనంగా నిర్వహించాలని, జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్, లింగన్న, బుచ్చయ్య, రాజన్న, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

మూఢనమ్మకాలను విడనాడాలి

తాండూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలను విడనాడాలని సీఐ కుమారస్వామి సూచించారు. మంగళవారం మండలంలోని రేచిని గ్రామంలో మూఢనమ్మకాలపై కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైన కొత్తవ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పేద విద్యార్థులకు విద్య కోసం పోలీసులు తమ వంతు సాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటారని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రం

నస్పూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : లైగింక దాడులకు గురైన బాధిత మహిళలకు, పిల్లలకు అండగా భరోసా కేంద్రం నిలుస్తోందని డీసీపీ భాస్కర్ అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీలో గల భరోసా కేంద్రంలో మంగళవారం ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ చెక్కులను ఆరుగురు బాధిత మహిళలకు డీసీపీ చేతుల మీదుగా అందించారు. ముగ్గురికి ఎడ్యుకేషన్ సపోర్టు కోసం, మరో ముగ్గురికి సెల్ఫ్ బిజినెస్ కొరకు మొత్తం రూ. 45వేల రూపాయల చెక్కులను అందించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్, భరోసా కో ఆర్డినేటర్ విజయ, సపోర్టు పర్సన్ పుష్పలత, ప్రియాంక, లీగల్ సపోర్టు పర్సన్ నవ్య, కృష్ణ పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్



విద్యార్థినికి సింగరేణి సీఎం అభినందన

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న సాధారణ ఉద్యోగి కూతురు ఇంటర్ మొదటి సంవత్సరంలో అద్భుత ప్రతిభ చాటడంతో సీఎండీ ఎన్.బలరాం మంగళవారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా అభినందించారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 భూగర్భ గనిలో రెంకా చంద్రమౌళి జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కూతురు రెంకా వైష్ణవి ఇంటర్ చదువుతుండగా, ఇటీవల విడుదలైన మొదటి సంవత్సరం బైపీసీ విభాగం ఫలితాలలో 440 మార్కులకుగాను 437 సాధించి మంచిర్యాల జిల్లా టాపర్‌గా నిలిచింది.

ఒక్కరోజు సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మే నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే ఒక్కరోజు సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి సమ్ము రాజయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులపై సమ్మె విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కార్పొరేట్ వైద్యశాల నిర్మాణానికి సన్నాహాలు

మందమర్రిటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రకృతికి విరుద్ధంగా భూగర్భంలో పని చేస్తున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో యాజమాన్యం కార్పొరేట్ వైద్యశాల నిర్మాణంపై దృష్టి సారించిందని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ కిరణ్‌రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బల్‌రాం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఆసుపత్రుల్లో కార్మికుల వైద్య సేవలను పరీక్షిస్తున్నామన్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్నపోస్టుల్లో భర్తీకి సంబంధించి కూడ త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

మందమర్రిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళ సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు హాజరై మాట్లాడారు. పోటీల్లో ఆదిలాబాద్-రంగారెడ్డి జట్లు తలపడగా రంగారెడ్డి గెలిచింది. అలాగే వరంగల్-మహబూబ్‌నగర్ జట్లు తలపడగా వరంగల్ గెలిచింది. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనపర్తి రమేష్, కోశాధికారి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా..





మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట రేంజ్ పరిధి లోని అటవీ ప్రాంతంలోని తిమ్మాపూర్ బీట్ ఏరియాలో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకుంటున్న ఫొటోలు కెమెరాలో చిక్కాయి. వేసవికాలం మండుటెండలు ఉండటంతో అటవీ శాఖ అధికారులు సఫారీ ట్రాక్ వెంట అక్కడక్కడ వణ్యప్రాణుల ఆకలి, దాహార్తి తీర్చడం కోసం గడ్డి మైదానాలు, నీటి గుంటలను ఏర్పాటు చేశారు. అటవీ అధికారులు ఏర్పాటు చేసి నీటి గుంటలు, గడ్డి మైదానాల వద్దకు పెద్ద సంఖ్యలో అటవీ ప్రాతంలో ఉండే వన్యప్రాణులు వచ్చి సేద తీరుతున్నాయి.

- లక్షెట్టిపేట, ఆంధ్రజ్యోతి



బార్ కోసం డ్రా

మంచిర్యాల ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతన బార్ కొరకు డ్రా తీసి ఎంపిక చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద గోపాల్, సీఐ గురువయ్యలతో కలిసి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూత పడిన బార్ స్థానంలో కొత్త బార్ కొరకు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీశారు. గుడిపేటకు చెందిన నడిపెల్లి ధనుంజయ్‌రావు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రాజ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు దీపక్, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నారలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ ప్రారంభించారు. ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, కో ఆపరేటివ్ సెక్రటరీ నరేష్, కేంద్రం ఇన్‌చార్జీ మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


లక్షెట్టిపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారునికి మంజూరు అయిన 20లక్షల రూపాయల చెక్కును అతని కుటుంబ సభ్యులకు బ్యాంక్ సిబ్బంది మంగళవారం అందజేశారు. దండేపల్లి మండలం రాజంపేటకు చెందిన బెంబడి సాయికుమార్(22) అనే వ్యక్తి గత ఏడాది డిసెంబరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సాయికుమార్ ఎస్‌బీఐలో ఖాతా తెరిచి ఏటా వెయ్యి రూపాయల ప్రమాద బీమా ప్రీమియం చెల్లించాడు. నామీనీ మృతుడి సోదరుడు బెంబడి రాజ్‌కుమార్‌కు చెక్కును అందజేశారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రితిష్‌కుమార్, బ్రాచ్ మేనేజర్ ఆనంద్‌హక్ పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులపై దృష్టి

- సిద్ధమవుతున్న నూతన భవనం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి నస్పూర్ ఏటీసీ..

7

సీఎంఆర్ అనుమతులు పొందేదెలా..?



- జోరుగా రైస్ మిల్లర్ల పైరవీలు?
- గతంలో 25 మిల్లులపై క్రిమినల్ కేసులు
- ఈయేడు ధాన్యం ఇచ్చేందుకు అధికారుల ససేమిరా

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్‌మిల్లింగ్‌రైస్) కోసం అధికారులు రైస్ మిల్లులకు పంపుతారు. గతంలో సీఎంఆర్ కింద ధాన్యం పొందినమిల్లర్లు పెద్దమొత్తంలో వాటిని పక్క దారి పట్టించగా, పరిశీలించిన జిల్లా ఉన్నతాధి కారులు సంబంధిత రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గత సంవత్సరం నుంచి కేసులు ఎదుర్కొంటున్న మిల్లులకు సీఎంఆర్ కోటాను అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. రైతులనుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాల్సి ఉంది. ఈ ఏడాది ఎలాగైనా సీఎంఆర్ పొందాలనే ఉద్దేశంతో మిల్లర్లు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

● ధాన్యం దించేదెలా...?

జిల్లాలో యాసంగి సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరగడం, పలు మిల్లులపై క్రిమినల్ కేసులు ఉన్నందున ధాన్యం ఎక్కడ నిల్వ చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లులు ఉండగా, వాటిలో బాయిల్డ్-19, రా రైస్ మిల్లులు 35ఉన్నాయి. యాసంగి ధాన్యం నిల్వలకోసం రైస్ మిల్లులకు జియో ట్యాగింగ్ ఇవ్వాల్సి ఉంది. అయితే సీఎంఆర్ ఇవ్వని 25 మిల్లులపై అధికారులు కేసులు బుక్ చేశారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆయా మిల్లుల యజమానుల నుంచి ధాన్యం సొమ్మును కూడా కొంతవరకు రికవరీ చేశారు. అభియోగాలు ఎదుర్కొంటున్న మిల్లర్లకు..

(మిగతా 7వ పేజీలో)

● పెరిగిన వరి సాగు...

గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి యాసంగి సీజన్‌లో వరి సాగు జిల్లాలో గణనీయంగా పెరిగింది. జిల్లాలో లక్షా 21వేల 702 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో దొడ్డురకం లక్షా 14 వేల 774 ఎకరాలు కాగా, సన్నరకం 6,928 ఎకరాల్లో సాగైంది. ఈ సీజన్‌లో మూడు లక్షల 40వేల 301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో దొడ్డు రకం మూబు లక్షల 23వేల 639 మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 16,662 మెట్రిక్ టన్నులు వస్తుందని భావిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కోసం యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 361 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 332 కేంద్రాలను ప్రారంభించగా, 85 కేంద్రాల ద్వారా 17,019 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.



ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలి

- డీఈవో యాదయ్య

మందమర్రిరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేసే ఏకరూప దుస్తులను మే 15లోగా అందించాలని యూనిఫాంలు కుట్టే కుట్టు మిషన్ నిర్వాహకులకు డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఏకరూప దుస్తులు కుట్టే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల కొలతల ప్రకారం ఏకరూప దుస్తులు కుట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో దత్తుమూర్తి, సెక్టోరియల్ అధికారి చౌదరి, సిబ్బంది మధు, శ్యామ్ పాల్గొన్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లోని ఏకరూప దుస్తులు కుట్టే కేంద్రాన్ని మంగళవారం డీఈవో యాదయ్య సందర్శించారు. ఏకరూప దుస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతతో దుస్తులను కుట్టాలని, పాఠశాలల ప్రారంభం నాటికి దుస్తులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, డీఈసీ బీ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, ఎంఆర్‌సీ, సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఝాన్సీనగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏరియాలోని అన్ని వార్డుల ప్రజలు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. దీనివల్ల నేరాలు జరుగకుండా అరికట్టడంతో పాటు దోషులను త్వరితగతిన పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. చిన్న, చిన్న గొడవలు, ప్రమాదాలను ఖచ్చితంగా కనిపెట్టే అవకాశం ఉంటుందన్నారు. కాలనీ ప్రారంభం, చివరలో కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నామని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అవలంబిస్తూ ముందుకు వెళ్లడం సరైందికాదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు కార్మికులందరూ దేశవ్యాప్త బంద్‌లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, లింగన్న, బాపు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడాల్లో తాగునీటి కటకట

కాసిపేట, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గూడాల్లో తాగునీటికి తీవ్ర కటకట నెలకొంది. 20 రోజులుగా మండలంలోని దేవాపూర్, సోనాపూర్, గట్రావుపల్లి, వెంకటాపూర్ పంచాయతీల పరిధిలో తాగునీరు రాక ప్రజలు అల్లాడిపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతిపంపుల్లో సైతం సరిగ్గానీళ్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం పంచాయతీ కార్యదర్శులకు చెప్పినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



దేవాపూర్‌లో తాగునీటి కోసం చేతిపంపు వద్ద నిరీక్షిస్తున్న మహిళలు

సమస్యల పరిష్కారానికే భూ భారతి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నీల్వాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, పక్కన కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు

వేమనపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మంగళవారం మండలంలోని నీల్వాయి రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుదంన్నారు. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని సూచించారు. రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతీగ్రామంలో రైతులకు రెవెన్యూ అధికారులు ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూ భారతి చట్టంలో పొందుపర్చిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ చట్టంలో అప్పీలు వ్యవస్థ కూడా ఉందని, ఇది ఎంతో కీలకమైందన్నారు. ప్రతీ రైతు భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి మండలంలోని 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌అలీ, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత బీసీ డిక్లరేషన్‌ను విస్మరించిందన్నారు. ఎంబీసీ మంత్రిత్వ శాఖను, బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేస్తామని, అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మిస్తామని, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గజెల్లి వెంకటయ్య, భీంసేన్, సతీష్, షేక్ సల్మాన్‌ఖాన్, భిక్షపతి, అంజన్న, లలిత, రవి, కిరణ్, రాజం పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అధికారులు పారదర్శకంగా సర్వే చేపట్టలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కాంగ్రెస్ నాయకులు, బంధువులు, కార్యకర్తల పేర్లను నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నో ఏళ్లుగా గూడులేక పేదలు ఇబ్బందులు పడుతుంటే ఇళ్లు ఉన్నవారికే ఇళ్లను కేటాయించడం సరైందికాదన్నారు. అనర్హుల పేర్లను జాబితాలో నుంచి వెంటనే తొలగించాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, నాయకులు హేమాజీ, గోవర్ధన్, సంతోష్, శ్రావణ్, స్రవంతి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశా రు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్, నాయకులు కొయిల్కర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

‘ఉపాధి’ పనుల్లో అవకతవకలు సహించం



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో కిషన్, అధికారులు

● డీఆర్‌డీవో కిషన్

మందమర్రి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని డీఆర్‌డీవో కిషన్ హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఏప్రిల్ 2024 నుంచి ఏప్రిల్ 2025 వరకు జరిగి న ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీచేసి నివేదికలు సమర్పించారన్నారు. పలు గ్రామాల్లో అవకతవక లు జరిగినట్లు గుర్తించా మన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పనులను చేపట్టాలని సూచించారు. రోడ్లు, తదితర అవసరాల కోసం పనులను నిర్వహించాలని సూచిం చారు. ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో రజియాసుల్తానా, శివరాం, కిరణ్, ఆడిటింగ్ టీం అధికారులు, సీపీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా టీజేఎస్ ఆవిర్భావ వేడుకలు

కాసిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బగూడెంలో తెలంగాణ జనసమితి(టీజేఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రెడ్డి, ఉద్యమ సంఘాల నాయకులు నీరటి రాజన్న, ప్రశాంత్‌రెడ్డి, గోనెల శ్రీనివాస్, గోనెల శ్రీలత, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల విద్యార్థులపై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, ఇతర పద్ధతుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను గమనిస్తూ అవసరమైన చర్యలు తీసు కోవాలన్నారు. వ్యవసాయాధికారులు జిల్లాలో గంజాయి సాగు చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలను అరికట్టే పోస్టర్ల ను విడుదల చేశారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పాల్గొన్న అధికారులు

● అడుగంటిన చింతకుంట చెరువు



అసలే వేసవి కాలం కావడంతో రోజురోజుకు మండుటెండలు మండి పోతున్నాయి. దీంతో చెరువులో ఉన్న జలవనరులు అడుగంటి కళతప్పుతున్నాయి. నెల కిత్రం కొంత మేరకు నీటితో కళకళలాడిన చింతకుంట చెరువు ఇప్పుడు అడు గంటి బీటలు వారి వెక్కిరిస్తోంది. దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామశివారులోని చింతకుంట చెరువు ఇలా అడుగంటి నెర్రెలు బాసి కళావిహీనంగా మారింది. - దండేపల్లి (ఆంధ్రజ్యోతి)